# మనసు మారింది!

శ్రీ కానాధి భొట్ల వెంకట సుబ్బారావు

"అబ్బ! కొట్టకండి! అయ్యో! చచ్చిపోతున్నా"

"చావు లమ్డికే - ఏదీ యిస్తావా యియ్యవా ?"

ఈ భాగవతం రోజూ జరుగుతూనేవుంది. ఆ రోజు కూడా మామూలే. భర్త కాంతారావు తప్పత్రాగి వచ్చాడు; ఒళ్లు తెలియని మైకంలో ఏవేవో అనరానిమాట లంటున్నాడు; వీపు చిటికేలా బాత్తున్నాడు. దెబ్బలు తినీ తినీ ఆమె శరీరం మొద్దుబారింది. ఇది రోజూ కాంతారావుకు వినోదంగా వుంది. సుగుణ మాత్రం దెబ్బలు భరించలేకపోతూంది. ఆమె పసిడి వన్నెల దేహం రోజూ అతని చేతుల్లో పిప్పి పిప్పి అవుతూండేది.

కాంతారావు తాలూకా ఆఫీసులో గుమాస్తా. ఆ వచ్చే ఎనభై రూపాయల్లో మూడు వంతులకు పయిగా త్రాగుడుకూ, చీట్ల పేకలకు ఖర్చుపెట్టేవాడు. అతని నిర్లక్ష్యమే హెడ్ క్లర్కునుండి క్లర్కుకు దింపింది. సుగుణ అడిగీ అడిగీ విసిగిన తరువాత మిగిలిన మూడో నాలుగో ఆమె చేతిలో పెట్టేవాడు. ఆ యిల్లాలు మూడూ నాలుగు రూపాయలతో సంసారమెలా యీదుకొస్తుంది ? తనూ, తన భర్తా, పిల్లలూ బ్రతకాలిసివచ్చె! అలాగే పుట్టింటివారు పెట్టిన నగలన్నీ కరిగించి యింతవరకూ సంసారాన్ని యీదుకొచ్చింది. ఇంక ఏముంది తన మెడలో- తల్లిగారు పెట్టిన మూడు పేటల గొలుసూతప్ప ! అది కూడా యిమ్మని పట్టుపట్టేడు.

"ఊ! తొందరగా ఇవ్వు - చేతిలో డబ్బులేక ప్రొద్దుటినుండీ త్రాగలేదు -" అంటున్నాడు భర్త.

"ఈ వేళకు త్రాగకపోతే ఏంపోయినదండీ ?"

ఆ మాట అనటానికి ఆమెకంతధైర్య మెలావచ్చిందో!

చెంప చెళ్లుమంది - సుగుణ కండ్లునీళ్ళతో నిండిపోయినవి. మిసమిసలాడే ఆమె లేతబుగ్గలు ఎర్రగాపొంగి మాంసపు ముద్దవలె తయారయినై.

ఇక దెబ్బలు భరించలేకపోయింది - గొలుసు తీసి యిచ్చింది. కాంతారావ్ గొలుసు తీసుకుని వెళ్లిపోయాడు.

♦ ♦ ♦

ఉన్న కొద్ది అన్నంలో కొంత పిల్లలకుపెట్టి, కొంత భర్తకు వుంచింది-పాపం, సుగుణ కాలే కడుపుతో అలానే మంచంమీదికి ఒరిగింది.

ఆమెకు తన చిన్నతనపు భోగాలు ఒక్కొక్కటే ప్రత్యక్షమాతున్నయ్. సుగుణ తాశిల్దారుగారమ్మాయి. చిన్నప్పటినుంచీ ఎంతో అల్లారుముద్దుగా పెరిగింది. కమ్మటి భోజనం; చక్కని దుస్తులు కట్టుకుని రిక్షాలో ప్రతిరోజూ స్కూలుకు వెళ్ళటం - తిరిగి రిక్షామీద యింటికి రావటం - ఇలాటి సుఖాలతో ఆమె బాల్యం గడిచిపోయింది.

స్కూలు ఫయినలు ప్యాసయింది - కాలేజీలో అడుగుపెట్టకముందే యీ సంబంధం కుదిరింది.

"అమ్మా ! ఆ అబ్బాయి బి. ఏ. ప్యాసయ్యాడు. తెలివికలవాడు, బుద్ధిమంతుడు ! ఇంతకంటే మంచి సంబంధం దొరకటం కష్టమమ్మా" అని తన తండ్రి అన్నప్పుడు తనెంత ఆనందపడింది ! ఎంతో సుఖపడతానని ఎన్నెన్నో కలలుగంది ! ఏదీ యిప్పుడు ఆ ఆనందమంతా ? ఆమె కోరికలన్నీ అడవిగాచిన వెన్నెలలైపోయినై. ఇవన్నీ ఆమె హృదయంలో ఒక్కొక్కటే మెదిలి మాయమైపోతున్నై. బాధగా ప్రక్కకు వత్తిగిలింది. కాని ఆమెకు నిద్ర పట్టలేదు. ఏవేవో ఆలోచనలతో బుర్రగిర్రున తిరుగుతుంది ! అటు చూస్తే భర్త త్రాగుబోతయ్యాడు. ఇటు పిల్లలు ఆకలితో అల్లల్లాడిపోతున్నారు. తనకు రెండు రోజులనుండీ ఒంటిపూట భోజనమే. తన బ్రతుకు యిప్పుడు మోడువారిన చెట్టయింది. ఎందుకొచ్చిన బ్రతుకిది ! హాయిగా ఎందులోనైనాపడి కళ్లు మూసుకుంటే పీడా వదలు

తుంది, అనుకుంది. ఆమెకు యిక జీవించాలని ఆశ లేదు - జీవితంమీద రోత పుట్టింది. ఇల్లంతా ప్రశాంతంగావుంది - ఆమె మంచంమీదనుండి లేచింది. దొడ్డి బావివైపు నడిచింది.

గభీమని చప్పుడవటంతో ప్రక్కయింటి వాళ్లంతా పరుగెత్తుకుంటూ నూతి దగ్గరకు వచ్చారు. వెంటనే ఒకడు గబగబా నూతిలోకి దిగి ఎంతో ప్రయాసతో బయటకు తీశాడు. కడుపులోని నీళ్లన్నీ బయట పడ్డాక ఆమెకు కొంచెం తెలివివచ్చింది.

"పాపం! పండండి పిల్లను చేతులారా ఆ త్రాగుమోతుకు కట్టబెట్టారు." అంది ఒకావిడె.

"అవునమ్మా! వచ్చిన జీతం త్రాగుడికీ, చీట్ల పేకకూ ఖర్చుపెట్టి యింట్లో చిల్లి కానీ యివ్వకపోతే ఏంచేస్తుందీ - ఆడది! ఎక్కడనుండి సంపాదించి కుటుంబమును పోషిస్తుంది? యీ బాధలన్నీ భరించలేక చావుకు సిద్ధపడింది" అంది ఒకావిడి గ్రుడ్లనీరు గ్రుక్కుకుంటూ.

"అందుకనేనమ్మా! ఆడపిల్లని ఒక అయ్య చేతిలో పెట్టేటప్పుడు ఒక చదువు విషయమేకాదు - బుద్ధి విషయంకూడా ఆలోచించాలి" అంది మరొకావిడె; యిక ముందు తన పిల్లల విషయంలో జాగ్రత్తపడాలన్నట్లు-

ఇలా ఎవరికి తోచినట్లువారు ఆమెను గురించి జాలి వెళ్ళబోశారు. నెమ్మదిగా యింట్లోకిచేర్చి ఒక మంచంమీద పడుకోబెట్టారు. ఆమెకు స్పృహ వచ్చింది; కళ్లువిప్పి చూచింది. ఒకామెవచ్చి ఆమె తలమీద తగిలిన దెబ్బలకు మందుపూసి కట్టుకట్టింది. కొంత సేపయిన తర్వాత నెమ్మదిగా లేచి కూర్చుంది.

"నన్నెందుకు బ్రతికించారు బాబూ! ఇంకా ఎంతకాలం కష్టాలనుభవించాల" అంది సుగుణ.

"పిచ్చిపిల్లా! చచ్చి ఏం సాధిస్తావమ్మా! ఇదుగో యిటుచూడు నీ పిల్లల్ని - నీవు బ్రతకాల్సింది కేవలం నీ భర్తను గురించికాదమ్మా! ముఖ్యంగా నీ పిల్లల పురోభివృద్ధిని గురించయినా నీవు బ్రతకాలి తల్లీ! నీవు లేకపోతే నీ పిల్లలగతి ఏమవుతుందో ఆలోచించుకో" అన్నాడు ఒక ముసలాయన.

ఇంతలో గందరగోళానికి పిల్లలు లేచారు. తల్లి ప్రక్కలో లేదు. అటూ యిటూ చూచి గబగబా పరుగెత్తుకుంటూవచ్చి తల్లివడిలో వ్రాలి "అమ్మా యిక్కడున్నావేమమ్మా! వీళ్లంతా ఎందుకిక్కడున్నారు" అన్నారు అమాయకంగా.

ఆమె హృదయంలో మాతృత్వం పెల్లుబికింది. బిడ్డల్ని తన హృదయానికి హత్తుకుంది.

ఇంతలో కాంతారావు తూలుకుంటూ యింట్లోకి వచ్చాడు.

"ఏమయ్యా! నీకు బుద్ధిలేదూ! పండండి పిల్లను అష్టకష్టాలు పెడుతున్నావే?" అన్నాడొకాయన.

"నిముషంలో తప్పిపోయింది; లేకపోతే నీగతీ, నీ పిల్లలగతీ ఏమయ్యేదో!" అన్నాడు మునుపటి ముసలాయన.

"పదండి పోలీసులకు పట్టిద్దాం త్రాగుమోతును;" అన్నాడొకడు ముందుకువస్తూ.

సుగుణ గబగబావచ్చి అతన్ని వారించి "అయ్యేమీ అనకండి యిదంతా నా ఖర్మ" అంది.

పిచ్చి పిల్ల! అనుకుంటూ వాళ్ళువెళ్లిపోయారు. కాంతారావుకు మైకంలో స్పష్టంగా ఈ మాటలు వినిపించకపోయినా ఎందుకనో యీ మాటలు అతని హృదయాన్ని కలచివేయసాగినై. గదిలోకివెళ్లి మంచంమీద పడుకున్నాడు. తప్పత్రాగి వచ్చిన మైకంలో ఏవేవో గొణుగుతున్నాడు. క్రమంగా అతనికి నిద్ర పట్టింది. అర్ధరాత్రి అయ్యేసరికి అతనికి మెళుకువచ్చింది. మత్తువదిలింది. కళ్లు విప్పిచూచాడు. ఎదుట ఏదో అస్పష్ట ఆకారం అగుపించింది.

"నీవు మనిషివేనా? నీకు హృదయంలేదూ! భార్యనలా కష్టాలపాలు చేస్తున్నావే? నీ వల్ల సుఖపడదామని ఎన్నో ఆశలు, ఎన్నో కలలూ కందే? అమాయకురాల్ని చేసి ఏడిపిస్తున్నావే?

ఆమె ఆశలనన్నీ అడవిగాచిన వెన్నెల చేయడమే కాకుండా నిర్దాక్షిణ్యంగా హింసిస్తున్నావే! పెద్ద చదువుకున్నావే - యివేనటయ్యా నీకు నేర్పింది? నీమాదిరిగా తప్పత్రాగి నీబావమరిది నీ చెల్లెల్ని కొడుతూంటే నీహృదయం సహిస్తుందా? నీ తలిదండ్రులు చూస్తూ వూరుకుంటారా? ఇష్టంవచ్చినంత వరకూ ఆడించి తరువాత పారెయ్యటానికి ఆటబొమ్మ అనుకున్నావటయ్యా. నిన్నుచేసుకొని ఆ అమ్మాయి సుఖంపడిందేమిటీ? తిట్లూ, శాపనార్థలూ దెబ్బలు తప్ప-పిల్లల అదృష్టం బాగుండబట్టి నలుగురూవచ్చి ఆమెను బ్రతికించారు _ లేకపోతే నీపిల్లల గతి ఏమయ్యేది? నీగతి ఏమయ్యేది?"

ఆ అస్పష్ట ఆకారం గుండెల్ని దూసుకుపోయేటట్లుగా ఎత్తిపొడిచింది.

అతనిలో ఏదోమార్పు కలిగింది. అప్రయత్నంగా జలజలా భాష్పకణాలు రాలినై.

కాంతారావ్ మంచంమీదనుండి లేచాడు. సుగుణ దగ్గరకు బయలుదేరాడు. ఆమెప్రక్కనే పసివాళ్లు అమాయికంగా నిద్రిస్తున్నారు.

"అమ్మ ఏమి అపచారంచేసిందని యిలావేధిస్తున్నావు నాన్నా!" అని పసివాళ్లు అతనివైపు జాలిగా చూచినట్లగుపించింది.

"నేనేంచేశానని నన్నిలా కష్టపెడుతున్నారండీ!" అని భార్య అతనివైపు జాలిగా చూసినట్లగుపించింది.

అమాయకంగా నిద్రిస్తుంది ఆమె. కళ్లనీళ్లు ఆమె బుగ్గలమీద చారలు కట్టినై. ఆమె బోసిమెడ హేళన చేసినట్లున్నది అతని కళ్లనుండి భాష్పధారలు వరదలై పారినై.

"సుగుణా!" అన్నాడు ఆమెమీద చెయ్యివేసి. సుగుణ వులిక్కిపడి కళ్లువిప్పింది.

"క్షమించు సుగుణా!" అన్నాడు భర్త.

ఆమె కళ్లల్లోనుండి ఆనందభాష్పాలు తొంగిచూచి, మంచందిగింది; భర్త పాదాలవద్ద కూర్చుంది.

"నేను నీకుచేసిన అపచారాలు మన్నించు సుగుణా! పిల్లలమీద ఒట్టువేసి చెబుతున్నా _ ఇక ఎన్నడూ అటువంటి దురభ్యాసాలకు లోబడను; ఎన్నటికీ మిమ్మల్ని కష్టపెట్టను. క్షమించు." అని ఆమె పాదాలను స్పృశించబోయాడు.

ఆమె వెంటనే ప్రక్కకుతప్పుకుంది.:

"ఛా! అలా కళ్లనీళ్లు పెట్టుకుంటారేం! ఈనాటికైనా నా అదృష్టం పండింది. అంతేచాలు. పిల్లలూ, నేనూ అదృష్టవంతులం. లెండి!" అంది సుగుణ.

అతనికళ్లనుండి అమృతం కురిసింది; ఆమెకళ్లనుండి ఆనంద భాష్పాలు తొంగిచూచినై.

క్రొత్తగా కాపురంపెట్టిన తర్వాత ఆమె తృప్తిగా భర్తతో కలిసి భోజనంచేసింది ఆ నాడే.

